అంత్యార్పణ

(నాటిక)

★

రచన:

ఆచార్య ఆత్రేయ

★

విశాలాంధ్ర ప్రచురణాలయం,
విజయవాడ-2.

ప్రచురణ నెం. 109

ప్రథమ ముద్రణ

ఫిబ్రవరి '55.

వెల : 0-4-0

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ-2.

ఒక మాట

★

ఈ నాటిక 1953 డిశంబరు ఆ ప్రాంతములో మద్రాసు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకోసం వ్రాయబడింది. చాలా తక్కువ వ్యవధిలో జయప్రదంగా ప్రదర్శించినందుకు వారికి నా అభివందనాలు. అప్పట్లో ఈ నాటిక విశాలాంధ్రలో ప్రచురింప బడింది.

సంవత్సరం జరిగిపోయింది. ఆంధ్రప్రభుత్వం పడిపోయింది. ఎన్నికలు వచ్చాయి. కమ్యూనిస్టుపార్టీ 169 స్థానాలలో పోటీచేస్తున్నది. ఈ వార్త వినగానే, కష్టజీవుల పార్టీ విజయానికి నేనూ, చేతనైనంత వూత ఇవ్వాలని అనిపించింది. శ్రీమతి జి. వరలక్ష్మితో ప్రస్తావించాను. ఆమె వెంటనే అంగీకరించింది. ఆమె అంగీకారం మాకు మరింత వుత్సాహాన్ని కలిగించింది. వెంటనే పార్టీవారికి తెలియచేశాం. వారూ సమ్మతించారు. జనవరి 21 నుంచి 30 వరకు ప్రదర్శనలు ఇవ్వాలనుకున్నాం. ఆవిధంగానే పార్టీవారు మదనపల్లె, ప్రొద్దుటూరు, అనంతపురం, కర్నూలు, తెనాలి, విజయవాడ, భీమవరం, నెల్లూరు పట్టణాలలో మొత్తం 8 ప్రదర్శనాలు ఏర్పాటుచేశారు. బయలుదేరక

ముందు, మద్రాసులోనే కొందరు మమ్మల్ని నిరుత్సాహ పరచారు. ఆంధ్రలో కొన్ని ప్రాంతాలనుంచి మమ్మల్ని బెదిరిస్తూ వుత్తరాలు వచ్చాయి. కానీ కాలు ముందు కేనడిచింది. బయలుదేరాం. ప్రతివూరూ మా కొక నూతన వుత్సాహాన్ని, బలాన్ని నింపింది. ప్రజలమీద అకుంఠిత విశ్వాసాన్ని కలిగించింది. నాటికలో ప్రతిమాటకు ప్రజల హర్షధ్వానాలు మిన్ను ముట్టాయి. లక్షలాది ప్రజలు చూచారు. ఇప్పటికి సుమారు కనీసం 8 లక్షల ప్రజ ఈ నాటికను చూచి ఆనందించి, అభినందించారు. ఈ నాటిక సార్థకమైంది. నేనూ ధన్యుణ్ణి.

రాజకీయంగా నచ్చచెప్పి ప్రజల్ని తమవైపు తిప్పుకో లేని వినాయకులు తప్పుడుదారులు తొక్కుతున్నారు. మామీద దుష్ప్రచారం చేశారు. వారిని గురించి ఇక్కడ ప్రస్తావించడం భాషను దుర్వినియోగం చేయటమే!

ప్రజలకు చాలా దూరంగావుండే ఒక ప్రత్యేక ప్రపంచంగా భావించబడే సినిమా రంగంలో వుండికూడా ఎన్నో కష్టనష్టాలను గణించక ప్రజాసేవే పరమావధిగా బయలు దేరిన శ్రీమతి జి. వరలక్ష్మికి నా విప్లవాభివందనాలు!

ఈ నాటకం ఇంత విజయవంతం కావటానికి సాయపడిన నటీ నటులకు, ఇతర కామ్రేడ్స్ అందరికీ నా కృతజ్ఞత!

ఈ నాటిక కమ్యూనిస్టుపార్టీ ప్రచారం నిమిత్తం వ్రాయ బడింది కాదు. ఇది నా నమ్మకం.

ఈ పర్యటన కమ్యూనిస్టుపార్టీ కోరి ఏర్పాటు చేసుకున్నది కాదు. మావిద్యుక్త ధర్మంగా భావించి మేమై ప్రతిపాదించింది.

మాకు అవకాశాన్ని కలగజేసిన పార్టీకి, సమాదరించిన ప్రజలకు అభివందనాలు.

—మీ ఆత్రేయ.

★

తప్పుల పట్టిక.

పుట	పంక్తి	ఒప్పు
18	14	'దేశశాంతికి' అన్నతర్వాత 'ప్రజాశాంతికి' అనికూడా చేర్చాలి.
20	3	'చేతులు కట్టుకున్నవాడు' అనేదానికి బదులు 'జగన్నాథం' అని చదువుకోవాలి.
22	6	తర్వాత యీ క్రింది సంభాషణ కలుపుకోవాలి. జగ : వస్తామ్మా ! భార : ఒరే ! అయిదు నిమిషాలుండు, నీతో మాట్లాడాలి (ఆజ్ఞాపించింది.)

నట వర్గం

★

భారతమ్మ : శ్రీమతి జి. వరలక్ష్మి

శేషయ్య : శ్రీ నాగభూషణం

మాలవాళ్లు : { శ్రీ మధుసూదనరావు
శ్రీ నెల్లూరు సత్యం }

వాలంటీరు : శ్రీ మధుసూదనరావు

జగన్నాథం : శ్రీ ఆచార్య ఆత్రేయ

హరిజనస్త్రీలు : { శ్రీమతి సరోజిని
,, ధీమతి
,, శకుంతల }

నేపథ్యగాయకులు :

శ్రీ సౌమిత్రి - శ్రీ పట్టాభి రామారావు.

సెట్టింగ్ :

శ్రీ గంగాధరన్

ఆంధ్రదేశంలో లక్షలాది ప్రజానీకం చూచి ఆనందించిన
"అంత్యార్పణ"లో ఒక సన్నివేశం.



భారతమ్మ : శ్రీమతి జి. వరలక్ష్మి, జగన్నాథం : ఆచార్య ఆత్రేయ.

అంత్యార్పణ

[నాటిక]

[అనాక పూరిగుడిస. తెర తీసేసరికి ప్రేక్షకులకు ప్రముఖంగా కనుపించేది ఎదురుగా గోడకు తగిలించివున్న కస్తూరిబా ఫొటో దానిక్రింద ఒక చిన్న స్టూలుమీద గాంధీ శిలాప్రతిమ, దానిదగ్గరే ఓ రాట్నం, ప్రేక్షకుల కుడివైపున ఒక మూలగా వంటిల్లు ఏర్పాట్లు చాలా క్లుప్తంగా, ఎడమవైపు వీధిలోకి వెళ్ళే ద్వారం, ఒక చిరుచాప, పీట, ఆసు పలక, దండెం, యీలాంటి చిన్న సామాన్లు. ఇప్పుడింట్లో ఎవ్వరూ లేరు. ఇల్లంతా ప్రశాంతంగావుంది. ఒక్కక్షణం తర్వాత వీధిలోంచి "భారతమ్మా, భారతమ్మా" అని ఒక మగ గొంతుక పిలుపు. బదులు లేనందువల్ల కాస్సేపాగి ఆ పిలిచినవ్యక్తి లోపలికి వచ్చాడు. బాగా ముదురు మనిషి; బక్కగా వున్నాడు. ముతక బట్టలు, పంచికట్టు, పైన ఖండువా, పొట్టిగా కత్తిరించినతల, పొలంమీది నుంచి అప్పుడే వస్తూన్నట్లున్నాడు. లోపలికొచ్చి ఇల్లంతా ఒక్కసారి కలయ చూచాడు. తనకు కావాల్సిన వ్యక్తి కనబడనందున మళ్లా ఒకసారి గట్టిగా పిలుస్తూ, దొడ్లో ఉన్నదేమోనని వెళ్తూన్నాడు.

ఇంతలో "ఎవరూ" అనుకొంటూ ఒక ముసలావిడ లోపలికివచ్చింది. ఆయన ఆగాడు. ఆమె పండు ముసలి. కానీ పళ్ళూ, వళ్ళూ గట్టిగానే వున్నాయి. ముతక ఖద్దరు కావిరంగుచీర కట్టుకుంది. తలలో నెరసినభాగం ఎక్కువ. ఎడమ చేతిలో పుల్లలమోపు, కుడిచేతిలో కర్ర, పుల్లలమోపుమీద తోటకూర కట్టలు వున్నాయి. జీవితంలో బాగా నలిగిన మనిషిఅని ముఖం చెప్తుంది. కళ్ళు మాత్రం అతి తీక్షణంగా వున్నవి. నడకలో ఒక విధమైన హుందాతనం వుంది.]

భారతమ్మ: ఎవరు? శేషయ్యా!

శేషయ్య: ఆఁ. నేనేనమ్మా! ఏంది భారతమ్మా నువ్వు! ఈ పుల్లలు పుడకలూ ఏంది? ఈ తోటకూర ఏంది!

ఈ రోజునకూడా నువ్విట్టా వున్నా వేందమ్మా! అన్నాయం మరీని.

భార : ఏం నాయనా! ఏం వచ్చిం దీరోజు?

శేష : ఏంవచ్చిందీ! మెల్లగా అడగతావే ఇంకా! వూళ్లోకి పోయావే చూళ్లేదూ ఎట్టాగుందో?

భార : చూచాన్నాయనా! దారిపొడుగునా పోలీసులు నిలబడి వున్నారు. ఎందుకో ఏమో!

శేష : ఎందుకా! ఏమీ ఎరగనట్టడగతుండావే!

భార : ఎరక్కకాదులే! దొంగలొచ్చినా, దొరలొచ్చినా పోలీసు కాపలా వెడతారు. ఇప్పుడు వచ్చేది ఎవరా అని! (చాపకోసం వెళ్ళింది)

శేష : పోవమ్మా! నీ మాటలూ నువ్వూనూ! చిన్నబ్బాయి గారు పది గంటలకంతా వస్తారంటేను. ఆయన మంత్రి అయినాక ఇదేకదమ్మా మొదటిసారి మనూరికి రావటం. అయితే భారతమ్మా నీకు ముందుగా జాబురాయలే దంటావా?

భార : రాయకపోయినా తెలిసిందిలే!

శేష : తెలిసేనా ఇంకా ఇట్టాగున్నావు! రాయలేదని ఆయన మీద సాదింపంటమ్మా! ఆయనకెన్ని పనులో ఏమో! కానీవమ్మా కానీ, కట్టవమ్మా తోరణాలు. మన సేద్దిగాణ్ణి పంపిస్తాగాని వాకిట్లో పందిరేయించు. చిన్నబ్బాయిగారు వస్తున్నారని వూరంతా ఒకటే కోలాహలంగా వుంటే-ఎన్ని పార్టీలు, ఎన్ని డిన్నర్లు - అది పోతేపోయిందిగానీ ఇంటి

నుంచి కాయగూరలు పంపిస్తా కాస్త కమ్మగా వండిపెట్టవమ్మా! ఎవరెన్ని పెట్టినా కన్నతల్లి నువ్వు పెట్టినట్టుంటుందా? (ఇటు అటు చూచి) ఒరే! మంచంలేదూ? ఇన్నాళ్లూ నేలమీదే పడుకొంటున్నావటమ్మా నువ్వు? ఛలేదానివే! ఒకమాట చెప్పంటే మనింటికాడ వూర్కే పడుండాయే – నవారుమంచం పంపించుండనటమ్మా?

భార : (ఇదివరకే ఒకటి రెండుసార్లు తనపని చూచుకొంటూ అతనివైపు చిరునవ్వుతో చూచింది) శేషయ్యా! (కాస్త కఠినంగా అన్నది) అదంతా ఏమీ అక్కర్లేదు కానీ నువ్వొచ్చినపని చూచుకో!

శేష : అదేంది భారతమ్మా! నేనింక దేనికొచ్చానని?

భార : నువ్వొచ్చింది ఇందుకే అయితే వెళ్లొచ్చు.

శేష : (దెబ్బతిన్నాడు. తమాయించుకొని) భారతమ్మా! కోప్పడితే కోపడ్డావుగానీ ఇదంతా సూస్తుంటే నాకు మహా పరితాపంగా వుంది. మొదట్నించి యీ మొండితనమేగదా నీది, చిన్నబ్బాయిగారితప్పేమో ననుకున్నానుగానీ తరువాత తెలిసింది, ఆయన ఇహ లేనట్టు అడుక్కున్నాడంటగా ఢిల్లీకి వచ్చి హాయిగా వుండవమ్మా అని. ఆ మాట నిజమేనా?

భార : నిజమో, అబద్ధమో అవన్నీ ఇప్పుడెందుకులే!

శేష : అదికాదు భారతమ్మా ఏంది చెప్పు నీకీ కర్మ? నీకేం తక్కువ? ఎంతకాలమని యిట్లా యీ పూరికొంపలో పుల్ల – పుడక ఏరి తెచ్చుకుని పొట్టపోసుకుంటావు? కొండంత కొడుకు అదృష్టంకొద్దీ పెద్ద పదవిలోకి వచ్చాడు.

హాయిగా ఢిల్లీలో బంగళాలో కాలుమీద కాలేసుకుని గడిపేయక ఏందమ్మా యీ అగచాట్లు. పదమ్మా పద. నామాట విను. ఇప్పటికి పడ్డ కష్టాలు చాలుగాని యీ వయసులోనయినా కాస్త సుఖపడవమ్మా.

భార : శేషయ్యా అయిపోయిందా ?

శేష : అంతేలే అబ్బాయిగారి మాటే వినలేదంటే నామాట వింటావా నువ్వు ? నువ్వు ఢిల్లీకిపో – యీడనేవుండు ఏమన్నా జేసుకోగాని యీరోజుమాత్రం నామాట కాస్త యినవమ్మా. ఇల్లూవాకిలీ అలికి – ముగ్గులు పెట్టించి, తోరణాలు కట్టించి పచ్చగా వుంచవమ్మా యింటిని. ఇందరంవుండి నిన్ను యిట్టా పాడు కొంపలో వుండ నిస్తున్నామంటే ఆయన ఏమనుకుంటాడు ?

భార : అదా శేషయ్యా నీ బాధ ?

శేష : ఆఁ నాబాద నీకేం తెలుస్తందిలే; తలుచుకుంటే గుండె తరుక్కుపోతుంది ఒక్కొక్కసారి. ఎంత సంసారం ? ఎంత శమామిషు ? దివాణంలాంటి యిల్లు దేశం దేశం అని దివాళా తీసిందికదమ్మా ! కాంగ్రెసులోనే కరిగిపోయిందే ! పెద్దబ్బాయిగారు తుపాకిగుండు తగిలి ఒరిగిపోవటం, అయ్యగారు జైలులో వుండగానే క్షయ వచ్చి పోవటం, అమ్మాయిగారికి పెళ్ళి అయిన అయిదోరోజు కంతా అయిదోతనం తీరటం, తినేవాళ్ళు తింటావుంటే దోచుకునే వాళ్ళు దోచుకుంటావుంటే, ధర్మసత్రంలాంటి యిల్లు హారతికర్పూరంలాగా హరించుకుపోవటం అంతా కళ్ళకు

కట్టినట్లు కనిపిస్తావుందమ్మా. ఇన్ని కష్టాలకు ఫలితంగా చిన్నబ్బాయిగారు యీనాటికి మంచిపదవికి వచ్చారు. దేశం అంతా ఆయన్ను చూచి ఓయబ్బో అంటావుంటే నువ్విట్టా మండిపోతా వేందమ్మా నీ ఛాదస్తంగాని.

భార : యింతకీ నీవు చెప్పేదేమిటి శేషయ్యా?

శేష : చెప్పే దేముందమ్మా! ఈ దినమన్నా అబ్బాయి గారిని యింటికి పిలిపించి నీ చేత్తో యింత అన్నం పెట్ట వమ్మా. ఎంతకాలం సాధిస్తావు నీ వైరం. అయినా ఆయన మీదనా నీకు వైరం? ఆయనేం జేశాడని? కమ్యూనిస్టులతో ఏమయినా కలిశాడా? సోషలిస్టుల్లో జేరాడా? కాంగ్రెస్ కేమన్నా ఎతిరేకం అయ్యాడా? ఏ కాంగ్రెస్ కోసమయితే మీ రింటిల్లపాది నాశనమయ్యారో ఆ కాంగ్రెస్ లోనే వుండి దేశంకోసం పాటుబడుతున్నాడుకదా? ఇంకెందుకు చెప్పు నీకీ బాధ? అట్టాంటి ఆయన్ను కన్నందుకు యింకా గర్వించాల్సిందిపోయి ఎందుకమ్మా కారాలు - మిరియాలు నూరతావు? ఆయన లేకపోతే యీరోజున కాంగ్రెస్ ఏమయ్యేదని? కులం - గోత్రం లేనోళ్ళంతా ఆ కర్యూనలులో జేరి గుద్దులాడుకుని ముక్కలు చింపిన యిస్తరి చేసుకున్నార్చుని ఆ వుండది కాస్త వూడగొట్టుకుంటే యీయన గాదటమ్మా ఆళ్ళనీ యీళ్ళని అంతా పోగేసి అందరినీ ఒక తాటిమీద నిలబెట్టుకొచ్చింది? ఈనాడు మరల ఏడాందలమైళ్ళ దూరంనుంచి యీడకు వస్తున్నాడంటె వూరకనేనా? మరల యీ ఓట్లన్నీ ఎట్టాగొట్టా పోగేశి కాంగ్రెసును

నిలబెట్టాలనికదూ? అసలాయనే లేకుంటే యీళ్ళు జేసిన పనులకు ఎవడు ఓటేస్తాడు? యింటుండా?

భార : (వచ్చే కోపమంతా అణచుకని) శేషయ్యా ఎందుకు నన్ను రెచ్చగొడతావు! నీతో వాదించటానికి నేను సిద్ధంగాలేను, నీవు వెళ్ళు.

శేష : అయితే రాకరాక అబ్బాయి వస్తావుంటే ఆయన ముఖ మయినా చూడకుండా వుండిపోతా? యింతటితో ఆయన్ని ఒదులుకుంటావటమ్మా?

భార : ఎందరినో ఎన్నిటినో, ఒదులుకున్నాను. అవుసరమయితే వాడినికూడా వదులుకుంటా.

శేష : సరే నీయిష్టం. అట్టాఅన్నాక నేనుజెప్పేదేముంది. వస్తా. (పోబోతున్నాడు)

భార : శేషయ్యా.

శేష : (ఆగాడు.)

భార : నువ్వొచ్చింది యీ పనిమీదేనా?

శేష : ఏందమ్మా అట్టా అడుగుతావ్.

భార : ఏంలేదు. ఇంత చిన్న విషయంకోసం నీ యంత పెద్దమనిషి యిక్కడకు రావటంఅంటే?

శేష : సరేలే! నీ దెప్పుళ్ళకేంగాని యింత చిన్నదే యిట్టా తెల్లారెనే? యింక పెద్ద విషయాలు చెపితేమాత్రం ఏం లాభం?

భార : ఉహూ! పోనీ చెప్పరాదు అదేదో.

శేష : ఆఁ ఎందుకులే. అసలే నీ మనసు బాగున్నట్లులేదు. అందులో అమ్మా - కొడుకు ఏదో అన్యోన్యంగా వున్నప్పుడు చెప్పొచ్చుగాని...

భార : ఫరవాలేదులే చెప్పు శేషయ్యా.

శేష : ఎందుకూ, నువ్వేమో మంచికయినా చెడ్డకయినా ఆయనముఖమే చూడనని భీష్మించుకుని కూచ్చుంటివే ?

భార : మంచికయితే ఎప్పుడూ సిద్ధమే శేషయ్యా.

శేష : ఆఁ! మంచిగాక నీతోయింకేమి జెపుతానమ్మా. నీ సమాచారం తెలవదూ ! నువ్వేమయినా అట్టా ఇట్టా మనిషివా అడ్డదారులు త్రిప్పటానికి.

భార : ఇంతకూ ఏమిటో చెప్పరాదూ ?

శేష : చెప్పమంటా ?

భార : (ఒక చిన్న నవ్వు)

శేష : ఏంలేదు భారతమ్మా. మన చెరువులోతట్టుభూమి వుంది చూశా ?

భార : ఆ. ఇరవై ముఫ్పై ఎకరాలు వుంటుందికదూ ?

శేష : ఆ! అంతేడదిలే. ఈడ్చి కొలిస్తే మహాగావుంటే పది ఎకరాలు వుంటదేమోలే.

భార : ఊ.

శేష : దానికి నేను అర్జీ పెట్టుకున్నానమ్మా. కర్నూలుదాకా పోయి ఏదో తంటాలుపడి సరేననిపించుకొచ్చా. ఈ ఎదవలు మాలోళ్ళున్నారే వీళ్ళు పెట్టారు దానికి

పెటకం. ఇప్పు డెవ్వారం కొంచం ఎదురుతిరిగింది. అయినా యీ ఎదవలు ఏంజేసుకుంటారు జెప్పు ఆ బూమి తీసుకుని? తినటానికి తిండికే తకరారయితే సాగుబడి చేసుకోవాలంటే యిత్తనాలకు మొదలుకొని అన్నిటికీ మనదగ్గరకే రావాలనే! ఎందుకు జెప్పు యీాళ్ళకు? అందుకనే నేను ఏమంటానంటే భూమి మనపేర పట్టాగాని, అమీన సాగుబడికి ఏట్టా వాళ్ళనుగాదని మనం యిక ఎక్కడికీ పోయేది లేదుగదా? చేసుకుంటారు; బతికిపోతారు. ఏమంటా?

భార: నువ్వు అనేది అంతాఅను; తరువాత చూద్దాం.

శేష: అదిగాదు భారతమ్మా; అసలు తగాదా ఎక్కడంటే యీ కమ్యూనిస్టులున్నారు చూశా! యీాళ్ళకి యింకెక్కడా గుక్కతిరక్క యీ మాలాళ్ళతో కలిశారు. ఇక దొలిచింది పురుగు వాళ్ళతలల్లో. ఇప్పుడు వాళ్ళు కూసే కూతేందో తెలుసా? ఏబయి ఎకరాలంటె ఎక్కువ ఎవరికీ వుండకూడదట! ఇన్నా న్యాయం? పెద్దోళ్ళు ఎప్పుడో సంపాయించినదంతా వదులుకుని నెత్తినగుడ్డేసుకుని పోవాలట అదీ దరువు. రాసిన పేరు చదవను రాని ఎదవలకు పట్టాలలో పేర్లు రాసుకోవటం ఎందుకు? యింటుండా? కనక నీవుజేయాల్సింది ఏమీలేదు. అబ్బాయిగారితో యిదంతా కమ్యూనిస్టుల ఆట అనీ, కాంగ్రెసును పడగొట్టటానికి ఎత్తుఅనీ, ఒక్కమాట చెపితే చాలు. చమడాలు ఒలిచేస్తాడు. ఇంకోరహాస్యం చెప్పమంటా! నే నీ మధ్యన వాళ్ళను కదిలించి చూశా! క్రిందటి ఎలక్షన్లో వున్నట్టున్నారనుకున్నావేమో! పూర్తిగా మారిపోయారు. ఆళ్లలైనంతా

చూస్తావుంటే ఆ గూడెంనుంచి ఒక్క ఓటు మన కాంగ్రెస్‌కి వచ్చేటట్టుగా లేదు. ఆఁ, అట్టాంటప్పుడు అసలు ఎందుకు యివ్వాలి వాళ్ళకు పట్టాలు; దూలబట్టా! అదీ నా పాయింటు.

భార : (ఇంతసేపు ఓపిక పట్టింది. ఇంక భరించలేక) శేషయ్యా! నడు బయటికి! ఈ కుళ్లు నా యింట్లోకి తీసుకురాకు. ఈ కుట్రలు, కుయుక్తులు, రాజకీయాలతో నాయిల్లు పాడు చెయ్యకు. వెళ్ళు.

శేష : (షాక్ తిని) భారతమ్మా!

భార : వెళ్తావా, లేదా?

శేష : (వెళ్ళిపోతూ) నేను జెప్పలా నీ మనసు మనసులో లేదని. మళ్లా వస్తాలే. (వెళ్ళాడు)

భార : (అలాగే కాసేపు చూసింది. తిరిగి గాంధి విగ్రహం దగ్గరకు వెళ్లి మోకరిల్లింది) బాబూ ఏమిటి యీ రాజకీయాలు; నా బిడ్డ మంత్రి కావటంవల్ల వచ్చిన మహాపాపమా యిదంతా? ఏమయిపోయింది తండ్రీ యీ దేశం? (బైట అమ్మగారూ, అమ్మగారూ అని కొన్ని కంఠాలు.)

భార : ఎవరూ!

బయట : మేమేనమ్మా! మాలోళ్ళం!

భార : (లేచి గబ గబా వాకిలిదాకా వెళ్లి) ఏమిట్రా! ఏమిలా వచ్చారు? రండి, లోపలికి రండి.

బయట : ఒద్దులే అమ్మా; యీడనే వుంటాం.

భార : ఛీ, వెధవల్లారా, రండిలోపలికి (అంటూ తను లోపలికి వచ్చింది. వెనకాల వాళ్ళూ వచ్చారు.) ఏరా గంగులూ ! ఇందరిని వెంటబెట్టుకొచ్చావు ?

వాళ్ళు : అమ్మా మీరే రచ్చించాలి. మా పిల్లా, మేకా కాపాడాలి (అంటూ అందరూ ఒక్కసారిగా ఆమె కాళ్ళమీద పడ్డారు)

భార : (కంగారుగా) ఏమిరా ! ఏమిరా యిదంతా ? ఏమొచ్చిందిరా యిప్పుడు ? చెప్పండి.

వాళ్ళు : ఏముందమ్మా; దిక్కులేని అనాదలమైపోయాం. ఇంకీ వూరొదిలి ఏడికన్నా పోవాల్సిందే, యీడ బతకలేం తల్లీ.

భార : ఏమైంది ! తాపీగా చెప్పండిరా.

ఒకడు : సెప్పరా సిన్నోడా !

చిన్నోడు : ఏంలేదమ్మా, సెరువుకు ఎగవన పాతికెకరాల బీడు పడుంటే అందరంకలసి నానాతిప్పలూపడి దాన్నోకదారికి తెచ్చుకున్నాం; ఫరవాలేదులే పైరు పెట్టుకుంటే బతికిపోతాం అని అనుకొంటూవుండగానే అదికాస్తా ఎగరదన్నుకుపోయారు.

భార : ఎవరు ?

చిన్నోడు : అంతా మనోళ్ళేనమ్మా. ఆశంకరయ్యేమో ఎప్పుడో జైలుకుపోయాడనీ, ఈశివకామయ్యేమో సిన్నప్పుడెప్పుడో సత్రాగ్రహాల్లో ముప్పైరూపాయలు జరిమానా కట్టినాడనీ, అట్టాయిట్టా జెప్పి, ఆళ్ళకు యీళ్ళకు పంచిపెట్టేశిరి. అది పోతేపోయె. ఆ పెంట దిబ్బలవతల పాక లేసుకు పడుంటే

ఆ ముండమోపినేలంతా తనదేనని ముత్యాలయ్య అర్జీ పెడితేనో దానికీ తలాడించిరి. మొన్న పొద్దనే ఆయనొచ్చి లేస్తారా, చస్తారా అని అదమాయించి అందరినీ చెట్లకింద జేర్చా డామారాజు. ఇం కెట్లాగమ్మా యీ వూళ్లో బ్రతికేది.

ఒకడు : ఒరే! యింకోటి మరసినావు గదంటరా?

చిన్నోడు : ఊఁ, చెప్పింది చాల్లే.

ఇంకో : పోరా. (ముందుకు తోసుకొచ్చి) ఇది కొంచెంయినం డమ్మా; యింతకన్నా అన్యాయం ఏమన్నావుందేమో. తాతలకాలంనుంచి పండినా పండకున్నా, పస్తులుండయినా శిస్తులు కట్టుకుంటూ ఆ కొలుభూముల్ని నమ్ముకుని పడివున్నాం. ఇప్పుడేదో కాలవలొస్తాయని బంగారం ముద్దలు పండుతాయనీ ఆశపడి, అడలగొట్టి ఆ కాస్తా లాక్కపోయిరి. పాతవి అట్టాపోతే కొత్తవి యిట్టా కొట్టుకుపోతే, కొలువులేక కొంపలేక ఎట్టా బతకాల చెప్పండమ్మా. ఈ అన్నాయానికి అద్దూ పద్దూ వుంటదా? మమ్మల్నేమయినా బతకంమంటారా? కట్టకట్టుకొని చావమంటారా?

భార : ఇదంతా నాతో చెప్పితే నే నేంచెయ్యగలనురా మీకు? నామాట ఎవరువింటారురా?

చిన్నోడు : ఏమోనమ్మా యింతూరులో యినిపించుకునే మారాజే కరువై పోయాడు. మీరు కాదంటే మేమేం చెయ్యం? మీ కాలంలో మమ్మల్ని కడుపులో దాచుకుని

కాపాడారు. ఇప్పుడు చిన్నయ్యగోరు పెద్దమంత్రి అయి పోయారంట; ఆయనకు తెలిసే యియన్నీ జరుగుతున్న య్యంట. కట కటలాడే కరువు రోజుల్లో మాకు కూడు పెట్టి కాపాడారు. మీ కడుపునపుట్టిన బిడ్డ యిట్టాచేస్తు న్నాడంటే ఎట్టా నమ్మమంటారు? నమ్మలేకనే ఆమడ దూరం స్టేషన్‌దాకాపోయి అర్జీ యిచ్చుకుందామంటే ఆయనదగ్గరకు జేరనీయకుండా దరిమికొట్టిరి. ఈడకొచ్చి నపుడన్నా చూత్తాడనుకుని ఆ కాయితం తపాల్లో ఏసి వచ్చాం. ఇయ్యాల యీడకొత్తన్నాడంట. పోగ్రాములు చూస్తే మునసబయ్య నడిగితే "పోండిరా, ఆయనకు ఏడది తీరిక" అంటాడిప్పుడు. ఎట్టా సచ్చేది! మీరన్నా సెపుతా రేమోనని మీకాడకొచ్చాం. మీ బిడ్డకు మీరు సెప్పక పోతే మరెవరు సెపుతారమ్మా! మీరు కాదంటే మేమం దరం మీ కళ్లెదటే యీడనేపడి చస్తాం. చెప్పండి ఆ మాటన్నా.

భార : గంగులూ, (అలాగే నిశ్శబ్దంగా వుంది) (కటకటలాడే కరువు రోజుల్లో మాకు కూడు పెట్టి కాపాడారు మీరు. "మీ కడుపున పుట్టిన బిడ్డ మమ్మల్ని యిట్టాజేస్తున్నారంటే ఎట్టా నమ్మమంటారు. మీ బిడ్డకు మీరు సెప్పకపోతే ఎవరు సెపుతారమ్మా" ఈమాటలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నయ్. కళ్ళనీళ్ళు బొటబొటా రాలినయ్) గంగులూ, మీ రందరూ వెళ్ళండి. నేను చెపుతా.

(భారతమ్మ కళ్ళవెంట నీళ్ళు కారటం గమనించారు. ఆమె బాధ గుర్తించారు.)

వాళ్ళు : వస్తానమ్మ. (అందరూ వెళ్ళబోతున్నారు)

భార : గంగులూ !

గంగు : అమ్మా!

భార : శేషయ్య మీ దగ్గరకు వచ్చాడా యీ మధ్యన.

గంగు : వచ్చాడమ్మా.

భార : ఏం మాట్లాడాడు ?

గంగు : మాట్లాడే దేముందమ్మా. మరల ఓట్లకోసం కాకుంటే మాకాడికొచ్చేవాడా ? మా తరుపున ఆయనే మాట యిచ్చాడంట కాంగ్రెస్‌కి ఓటిస్తానని. ఆమాట సెప్పి, ఆర్డరేసి పోదామనుకున్నాడు.

(భారతమ్మ అలాగే స్థాణువుగా కూలబడివుంది. జయ జయ ధ్వానాలు మేళాలు, బ్యాండు కోలాహలంగా దూరంగా వినిపిస్తున్నాయి. క్రమంగా దగ్గరకొస్తున్నట్లు దగ్గరగా వినిపిస్తున్నాయి)

భార : మీరేమన్నారు.

చిన్నో : అనేదేముంది. నిరుడు వేసిందానికి నెత్తిమీద సెయ్యెట్టేరి. ఇక యీ యేడే యెయ్యాల ! దేనికీ మేమింతోరకు ఏమీ అనుకోలా, అందరం కలసి ఆలోచించుకొని చెప్తా మన్నాం.

భార : అంతేలేరా ! ఆలోచించాల్సినఅవసరం ఏర్పడింది. ఆలోచించే చేయండి.

గంగు : వస్తామ్మా !

(అందరూ వెళ్లారు.)

("జై జగన్నాథంగారికీ జై, గాంధీ మహాత్మునకూ జై, జవహర్‌లాల్ నెహ్రూకూ జై" అని నినాదాలు. భరింపరానంత దగ్గరగా దగ్గరగా యీ శబ్దాలు హెచ్చినయ్. భారతమ్మ గబగబా వాకిలిదగ్గరకు వెళ్లి బైటకు చూసింది. ఇక చూడలేకపోయింది. దబాలున తలుపు మూసింది. వెనక్కు తిరిగి గాంధీవిగ్రహం దగ్గరకొచ్చింది. "బాపూ" అంటూ చతికిలబడి ముఖాన్ని చేతులతో కప్పుకుంది. ఒకటి, రెండు నిమిషాలు అలాగేవుంది. బయట తలుపు తట్టిన చప్పుడు. మెల్లిగా లేచి)

భార : ఎవరూ ! (వెళ్లి తలుపు తెరిచింది)

భార : ఎవరు నాయనా ?

అతను : జగన్నాథంగారు పంపారమ్మా.

భార : (వెంటనే ఏమీ మాట్లాడక ఆవేశాన్ని చంపుకుని) ఏం ?

అతను : మిమ్మల్నొకసారి పిలుచుకు రమ్మన్నారమ్మా.

భార : నన్నా ! ఎక్కడున్నాడు ?

అతను : జోగయ్యగారి నగరిలో.

భార : నగరిలో! నగరిలో వున్నాడా ? అంతకన్నా నరకంలో వుండలేకపోయాడూ! వెళ్ళు. రానని చెప్పు. వెళ్ళు. (ఇల్లంతా కాలుకాలినపిల్లిలా తిరుగుతూ మాట్లాడుతూంది) నా బిడ్డా వాడు. నా కడుపున పుట్టినవాడేనా ? అందరితోపాటు వాడూ పోయివుంటే ఎంత బాగుండేది ? నాకీ దుఃఖం వుండేదా ? (గబగబా వాకిలిదాకా వెళ్ళి) నగరులో వున్నాడా ! సిగ్గులేదట్రా వాడికి. బ్లాక్‌మార్కెట్‌లో వ్యాపారంచేసి, జనాన్ని పీక్కుతింటుండే ఆ జోగయ్య ఇంట్లో ఎలా అడుగు పెట్టాడురా వాడు. మంచినీళ్ళయినా ముట్టుకోకూడని మహాపాపిష్టికొంపకదరా అది. వెళ్ళు, రానని చెప్పు. వెళ్ళు.

(లోపలికి వచ్చింది. కాస్త ఒక్క క్షణం తటపటాయించి, మళ్ళా వాకిలి వైపు పరుగెత్తుతూ) ఇదిగో అబ్బాయ్! యిలా రా, వాడితో చెప్పు. నేను చెప్పానని చెప్పు. వాడికి కన్నతల్లివుందని ఏమాత్రమన్నా జ్ఞాపకంవుంటే వాణ్ణే యిక్కడికి రమ్మను. అదీ నాకోసంకాదు. వాడికోసమూ కాదు. ఎందుకయినా సరే ఒకసారి వచ్చిపొమ్మను, అంతే. (ఉద్రేకంతో బాగా అలసిపోయింది. తలుపువేసింది. మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చి చరఖా దగ్గర కూలబడింది. ఆవేశం బాగా చల్లారింది. తమాయించుకుని రాట్నం తిప్పుతూంది. బయట లౌడ్ స్పీకర్‌లో మొదట జయజయ ధ్వానాలు. తరువాత కరతాళధ్వనులు. లౌడు స్పీకరులో ఒక కంఠం)

ఒకకంఠం : సోదర సోదరీమణులారా! ఈనాడు మనకు పర్వదినం. ఎందుచేతనంటే మనవూళ్ళో పుట్టి, మనవూళ్ళో పెరిగి, మనమధ్య తిరుగుతూండిన శ్రీ జగన్నాథంగారు యీనాడు ప్రభుత్వంలో వున్నతపదవిలో వున్నారంటే మన మెంతో సంతోషించవలసినవిషయం. ఈయొక్క జగన్నాథంగారు వున్నారే, వీరు ఇన్నేళ్ళ తరువాత మన వూరికే, కాదు వారి వూరికే వస్తున్నారంటే యీరోజు పర్వదినం కాదా? చెప్పండి. ఈయొక్క జగన్నాథంగారినిగురించి మీకు నేను ఎక్కువగా చెప్పటంవుండదే అది అనవసరం. వీరి కుటుంబం స్వాతంత్ర్యపోరాటంయొక్క దీనిలో సర్వస్వం ధారపోసింది. ఈయొక్క సంఘటన నాకు బాగా జ్ఞాపకముంది. ఒకనాడు నేను నాకళ్ళారా చూశాను. వీరింటియొక్క బట్టలకొట్టులో వున్న ఎలుకలు సీమగుడ్డ లన్నింటినీ చెత్తా చెదారముగా కొట్టివేసి, ఖద్దరుబట్టలయొక్క జోలికే పోలేదు. పూర్వం కుందేలుయొక్క ధైర్యాన్ని చూచి, ఆ స్థలంయొక్క మహి

మను గుర్తించారట విద్యారణ్యస్వాములవారు. అట్లాగే యీాయొక్క ఎలుకలయొక్క దేశభక్తిని చూచి, మనం వీరి కుటుంబంయొక్క గొప్పతనాన్ని తెలుసుకోవచ్చు. అంతటి దేశభక్తిపూరితమైన కుటుంబములో జన్మించిన యీాయొక్క జగన్నాథంగారు నేడు ఎన్నికల ప్రచారంకోసం ఆంధ్రదేశ పర్యటన ప్రారంభించారు. వారు కమ్యూనిస్టు ప్రమాదాన్ని గురించి, మన కర్తవ్యాన్ని గురించి వుపన్యసిస్తారు. మీారందరూ నిశ్శబ్దంగావుండి చివరిదాకా యీాయొక్క ఉపన్యాసం వినాలని మాయొక్క కోరిక. (కరతాళాలు, అది సమసిన తరువాత ఒక పాడ్పద్గు, తరువాత జగన్నాథంగారి కంఠం.)

జగ: సోదరీ సోదరులారా! ఈ నియోజకవర్గానికి శ్రీ శ్రీ రాజా మహేంద్ర వీర వెంకట భూపాల్ రావు బహద్దూరు గారిని కాంగ్రెసుతరఫున నిలబెట్టాం. వారికే మీా వోటు యివ్వాలని ఖచ్చితంగా చెప్పటానికే యింతదూరం వచ్చాను. కొందరు ద్రోహులు ఆయన జమీాందారని, జస్టిస్‌పార్టీ మనిషని, పోయిన ఎలక్షన్సులో కాంగ్రెసుతో పోటీచేశాడని ప్రచారంచేస్తున్నారు. అవన్నీ నిజమే. అయినా అవి మీారు మరచిపోవాలి. ఈనాడు కమ్యూనిస్టులను ఎదుర్కోవాలంటే, ఎన్నికలలో గెలవాలంటే, అంతంతమాత్రపువాళ్ళైతే తట్టుకోలేరు. ఆమాత్రం స్తోమతుగల మనిషి కావాలనే నిలబెట్టాం. ఇంకోరహస్యం చెప్పాలి. ప్రఖ్యాత గాంధీజ్యోతిష్కుడికి వీరి జాతకం చూపించాం, వీరు ప్రధానమంత్రిఅయ్యేయోగం వుందని గట్టిగా చెప్పారు. అందువల్లనే వీరిని నిలబెట్టాం. వీరు

జమీందారన్నది మరచిపోండి. వ్యక్తులను చూడకండి. కాంగ్రెసుమహాసంస్థను చూడండి; కావంటె నన్ను చూడండి. కాంగ్రెసుమహాసంస్థ మీకు తెలియంది కాదు. బ్రిటిష్ప్రభుత్వంతో హోరాహోరిగా పోరి, శాంతి సమరం సాగించి, ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, ఎంతో త్యాగం చేసి, స్వాతంత్ర్యంసాధించి యీనాటికి రామరాజ్యం స్థాపించింది కాంగ్రెసుమహాసంస్థే.

ఒకడు: అయ్యా! అదంతా మాకు తెలుసు. మిమ్మల్ని ఒక్క విషయం అడగదలచుకున్నాం. దయచేసి జవాబు చెప్తారా.

మంత్రి: ఎవడ్రా వాడు.

ఒకడు: నేనయ్యా. పోయినసారి మీకు ఓటిచ్చి గెలిపించిన ప్రజల్లో ఒకడిని. దయచేసి ఒక్కవిషయానికి జవాబు చెప్పండి.

మంత్రి: మీరు చెప్పేది నాకు వినపడలేదు. కనుక జవాబు చెప్పే అవసరంలేదు.

అందరు: చెప్పాలి. చెప్పితీరాలి. చెప్పాలి.

కంఠం: సోదరులారా చెప్తాం. చెప్తాం. గాంధీమహాత్ముడు మనకు నేర్పిన ఆ యొక్క అహింసాసిద్ధాంతం మరచి పోకండి. ప్రశాంతంగా అడగండి.

ఒకడు: అయ్యా! కాటూరుసంఘటన అందరికీ తెలిసిందే. ఆడా మగా తేడాలేకుండా బట్టలూడదీయించి నడిబజార్లో నడిపించారు. కొరడాలతో కొట్టారు. అమాయకప్రాణా లను ఆహుతిచేసుకున్నారు. ఇంతటి దౌర్జన్యం ఏదేశంలో

నైనా, ఎప్పుడైనా ఏ ప్రభుత్వమైనా జరిపిందా? సామ్రాజ్యవాదులైన బ్రిటిష్‌వారి పరిపాలనలోనైనా యింతటి ఘోరం జరిగిందా అని అడుగుతున్నాను.

మంత్రి: ఎవడా అల్లరివెధవ! గెంటించండి వాడిని.

ఒకడు: అడిగితే గెంటిస్తారు. ఇంకా అడిగితే కాల్చేస్తారు. అంతేకదా మీరు చేసేది. అమాయకుడైన పిచ్చయ్యను ఏంచేశారు. ఏ పార్టీలతో రాజకీయాలతోనూ సంబంధం లేనివాడు. వ్యక్తిగతంగా మీకున్న మనస్పర్థలతో అకారణంగా కాల్చి చంపేశారు. అతను చేసిన నేరం ఏమిటి చెప్పండి.

అందరు: అవును. అన్యాయం. దౌర్జన్యం. చెప్పండి. జవాబు చెప్పండి.

జగ: ఇలాగే అల్లరిచేశారా! మిమ్మల్ని అణిచేసేమార్గం మాకు తెలుసు. దేశశాంతికి భంగం కలిగించే ఎవరినైనాసరే ప్రభుత్వం సహించదు.

జనం: ఓయబ్బో! ప్రజాశాంతట శాంతి. మేమంతా ఎవరం? ప్రజలంకామూ! ప్రజలే అడుగుతున్నారు. చెప్పండి.

జగ: మీరు ప్రజలుకాదు. అల్లరిమూక.

జనం: ఏయ్ ఏం కూశావ్?

జగ: దౌర్జన్యానికి దిగారా! ప్రభుత్వం నరసింహావతారం దాలుస్తుంది. ద్రోహుల్ని కాలరాచేస్తుంది. అవుసరమైతే ఆయుధబలం వినియోగించటానికి వెనుదీయం. దౌర్జన్యానికి

దౌర్జన్యమే; అహింసఅంటూ ప్రభుత్వం పడివుండదు. అహింస అని వ్రారుకునేకాలం పోయింది.

భార : (ఇంట్లో యిదంతా విన్నది. నఖశిఖపర్యంతం వణికిపోయింది. కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. పెరుగుతూన్న ఆవేశాన్ని, సభలో రేగుతున్న ఆందోళనను అనుసరించి ఇక్కడ రాట్నం వేగం పెరుగుతూంది. ఇక భరించలేక చ్రుమని లేచింది. రాట్నంమాత్రం విష్ణుచక్రంలా తిరుగుతూంది. ఆమె చరాలున వాకిలి తలుపు తెరచి, వెర్రిగా అరచింది) ఆపరా దౌర్భాగ్యుడా, ఆపు! నీ వెధవ కూతలు ఆపు. అహింసకు కాలం పోయిందా, ఇంకా కాలం పోలేదు. ఎప్పటికీ పోదు. (బయట గోల అణిగింది. భారతమ్మ పాతాళానికి క్రుంగి పోయింది. మనిషిలా మెల్లగా తిరిగి లోపలికి వచ్చింది. తనలో తాను గొణుక్కుంటూ వుంది.) వీడెందుకింకా బ్రతుకుతున్నాడు ? నా కడుపులో యీ చిచ్చుపెట్టటానికా ? ఎందుకు ? ఈ క్షుద్రాన్నంతా చూడకుండా నేనైనా పోరాదూ ?

(కూలబడి పోతుంది.)

ఒకడు : అమ్మా, అమ్మా ! బాబుగారు వస్తున్నారు.

(ఇంతలో ఇంకొకడు ఒక మడతకుర్చీ తీసుకువచ్చాడు. దాన్ని అక్కడ వేయబోతాడు. భారతమ్మ చూసింది.)

భార : ఎందుకురా అది ?

వాడు : అయ్యగారి కమ్మా.

భార : తీసుకుపో !

వాడు : (జంకుతున్నాడు.)

భార : (గట్టిగా) పో, బైటికి. తీసుకుపో, ఊం.

వాడు : (కుర్చీ తీసుకుపోతాడు.)

(మొదట వచ్చినవాడు చేతులుకట్టుకుని నిలుచున్నాడు. కారు హారన్, చాలాసార్లు—"తప్పుకోండి-తప్పుకోండి" అని కేకలు. జగన్నాథం వస్తున్నాడు. గడపదగ్గరుండగానే చేతులుకట్టుకున్నవాడు తుమ్మాడు. ప్రక్కన వున్నవాడు టువలు అందించాడు. జగన్నాథం మూతి తుడుచుకుంటూ వచ్చాడు.)

(మనిషి బాగా నిమ్మపండులాగా నిగనిగలాడుతున్నాడు. కాయకల్పం చేయించుకున్నవాడిలా వున్నాడు. షేర్వాణీ, షరాయ్, ఖద్దరుటోపీ యిదీ అతని వేషం.)

జగ: ఏమమ్మా! ఎలా వున్నావు?

భార: (ఏమీ జవాబుచెప్పకుండా వాకిలిదాకా వెళ్ళి బైటికి అటూ యిటూ చూసి తిరిగివస్తూ, చేతులుకట్టుకుని నిల్చున్న అతనితో) **అబ్బాయ్! నువ్వు కాస్త అవతలికి వెళ్లు.**

(అతను వెళ్ళాడు.)

ఆ పోలీసులెందుకురా **అక్కడ?**

జగ: ఏదో వుంటారులే అమ్మా. వచ్చీరాకముందే మొదలు పెట్టావూ? ఇదిగోమ్మా! నీ న్నొక విషయం చివరిసారిగా అడిగిపోదామని వచ్చాను.

భార: నేనూ, నిన్నొకవిషయం చివరిసారి అడుగుదామనే పిలిపించాను.

జగ: అయితే ఢిల్లీకి వస్తావా?

భార: ఢిల్లీకివచ్చి నే నేం చేసేదిరా? న న్నే దేశానికి పంపు తావు రాయబారిగా?

జగ: సరేలేమ్మా! ఎప్పుడూ నీతో వుండేగోలే! మా ప్రభుత్వ మన్నా, మేమన్నా నీకు పరిహాసమైపోయింది. అందరి లాగా నువ్వేమన్నా రాజకీయాలు తెలియనిదానివా

దఖాయించడానికి! రాజకీయాలు నీ రక్తంలో యింకి పోయాయి. నువ్వంటూనే వుంటావు, నేను పడుతూనే వుంటాను. కానీ నువ్వు బయల్దేరి వచ్చేయమ్మా? ఈ బాధలన్నీ నీ కెందుకు! నలుగురూ నన్నంటున్నారు ఇంత పెద్ద నాయకు డైనాడుగాని కన్నతల్లి కింతతిండి పెట్టలేదని.

భార : నన్నూ అంటున్నారురా, కన్నతల్లిగావుండీ కొడుక్కి ఆమాత్రం మంచీ చెడ్డా చెప్పలేకుండాపోతూందని.

జగ : ఏమిటమ్మా ఆ మంచీ, చెడూ? ఎవడు నిర్ణయించేది? ఎవడు ఎవడికి చెప్పేది? అయినా నీతో వాదించటానికి నాకు తీరిక లేదుగాని.

భార : ఏం, టీ పార్టీవుందా? డిన్నరుందా?

జగ : అమ్మా, నువ్వనవసరంగా నన్ను బాధపెడుతున్నావు. ఇదే యింకొకరంటే బాగా జవాబుచెప్పేవాడిని. నీ కేదో రాజకీయాలు తెలుసుగాని, అందులోవున్న ఢొంకతిరుగుళ్ళన్నీ అర్థంకావు. నువ్వింకా సత్యకాలంమనిషిలా ముక్కుకు సూటిగా పోతామంటే వీల్లేదు. దేశభక్తిఅని కళ్ళుమూసుకొని నిప్పుల్లో దూకితే ఏం లాభం?

భార : పోనీలేరా? మీరు పూలల్లోపడుకుని, మిమ్మల్ని నమ్ముకున్న ప్రజల్ని నిప్పుల్లో దూకించండి.

జగ : సరేలేవే! నువ్వు చచ్చేదాకా యింతే! నువ్వు మారవు. మరి నేను వెళ్ళొస్తా.

(ఇంతలో ఒకడు వచ్చాడు.)

వాడు : ప్రోగ్రాం సరిగ్గా ఆరుగంటలకని మునసబుగారు చెప్పి రమ్మన్నారయ్యా.

భార : ఏం ప్రోగ్రాం నాయనా!

వాడు : విజయలక్ష్మీ కాఫీక్లబ్ ప్రారంభోత్సవం అమ్మా.

భార : ఊహుఁ! చాల ఘనకార్యమే. (అంటూ చురుగ్గా చూచింది జగన్నాథంవైపు)

జగ : (వచ్చినవాడితో) వెళ్ళి చెప్పవోయ్ వస్తున్నామని. (వాడు వెళ్ళాడు) ఊఁ, చెప్పమ్మా ఏమిటో!

(అంటూ ఇటూ, అటూ యిల్లంతా కలయచూచి స్టూలుమీద వున్న విగ్రహాన్ని క్రిందకుదింపి కూర్చున్నాడు, ఆ స్టూలుమీద.)

భార : (చాలా నిశితంగా చూస్తుంది.)

జగ : చెప్పవేఁ!

భార : (పలకలేదు. అలాగే చూస్తుంది.)

జగ : (ఆ చూపులకు మాడిపోయాడు. తను చేసినపని గుర్తించాడు. సర్దుకుంటూ లేచాడు.) కానీయమ్మా చెప్పమరి!

భార : మనవంశం ఎట్లావుండేదో, ఇప్పుడెట్లా అయిందో, ఎందుకిలా అయిందో నీకు జ్ఞాపక ముందా ?

జగ : బాగా జ్ఞాపకముందమ్మా.

భార : ఒకసారి గాంధీమహాత్ముడు మనయింట్లో విడిదిచేశాడు. అప్పుడు నువ్వు ఆయన్ను "తాతా ఒక్కసారి నవ్వు" అని అడిగావు. పది రూపాయలు యిస్తే నవ్వుతా నన్నాడు. చేతిలోమురుగులు తీసి యిచ్చేశావు. నిన్నాయన ఆశీర్వదించారు, ఏమని ఆశీర్వదించారో గుర్తుందా ?

జగ : లేకేమమ్మా; ఇదంతా ఆయన ఆశీర్వాదమేగా ?

భార : హుం! మీ అన్నయ్య సత్యాగ్రహంలో తుపాకికి గుండె చూపాడు. పోలీసులు కాల్చేశారు. ప్రాణాలు వదుల్తూ నీతో, నాతో ఏమిచెప్పాడో గుర్తువుందా ?

జగ : ఇప్పు డదంతా ఎందుకమ్మా.

భార : ఎందుకో కాదు. భవిష్యత్ కు మంచి బాట వేసుకోవా లంటే, గతం జ్ఞాపక ముండాలి.

జగ : ఆ కాలాలు వేరమ్మా !

భార : కాలంలో ఏముందిరా ? మతులు చెడి మనం మారాం గానీ, కాలం అలాగేవుంది. మంచికెప్పుడూ కాలం వుందిరా.

జగ : అదంతా వట్టి పిచ్చిమాటలమ్మా. అంతర్జాతీయంగా పరిస్థితులు అల్లకల్లోలమైపోతున్నాయి. ప్రపంచమంతా ఒక మహాప్రవాహంగా ఎక్కడికో కొట్టుకొనిపోతోంది. ఈ మహాప్రవాహంలో మన మెంత ? మొన్నమొన్న పుట్టిన వాళ్ళం. ఆ ప్రవాహాన్ని ఎదురీదటమంటే కానిపని. ఊరికే ఇక్కడ కూర్చొని కబుర్లు చెప్పినట్లుకాదు. ఒక్కొక్క సమస్య కొండలా నెత్తినపడుతూంటే తప్పించుకుని వూపిరితిప్పుకునేటప్పటికి తలప్రాణం తోకకొస్తూంది. ఓర్వలేని వెధవలు.

భార : జగ్గూ, (క్షణం నిశ్శబ్దం) చేతలుమాని మాటలునేర్చారురా మీరంతా. అందుకే మహాత్ము డానాడు స్వరాజ్యం రాగానే అన్నాడు, ఇక కాంగ్రెసును రద్దుచెయ్యండి అని. ఆయనకు బాగా తెలుసు. మనం ఆందోళన చేయటానికి

అలవాటుపడ్డాంగాని పరిపాలనకు పనికిరామని.........
అదికాదురా, మిమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నది అంతర్జాతీయ పరిస్థితుల్లోపడి కొట్టుకోటానికా! ఇప్పుడు నువ్వు ఆ జోగయ్యకొంపలో దిగటానికీ, మాలవాళ్ళు చచ్చిచెడి సాగుచేసుకున్న భూముల్ని మీలో మీరు పంచుకోటానికీ, ముత్యాలయ్యకు మీ మద్దతుయిచ్చి వాళ్ళకు నిలువ నీడలేకుండా చేయటానికీ అంతర్జాతీయ పరిస్థితులురా కారణం?

జగ: ఎవరు చెప్పారు నీ కిదంతా?

భార: ఒకరు చెప్పాలా! నీ అంతరాత్మను అడగరా చెప్తుంది. బాపూజీ పవిత్రంగా ప్రవేశపెట్టిన యీ ఖద్దరులో దొంగలు దాక్కున్నారురా యీనాడు.

జగ: అమ్మా! (వెళ్ళబోతున్నాడు)

భార: (అతని చేతులు పుచ్చుకుని) నామాట వినరా. వద్దురా మన కీక్షుద్రం. సంస్థానంలాంటి సంసారం చితికిపోతూంటే సహించాను. మన యింట్లో నౌకరుగావుండి పోలీసులో చేరిన వెంకడు దేవుడిలాంటి మీ నాన్నను బూటుకాల్తో తన్నుతుంటే చూస్తూ భరించాను. కాంగ్రెస్ వాడైతేగాని నా అల్లుడు కావటానికి వీల్లేదని పెద్దపెద్ద సంబంధాలను మీ నాన్న కాలదంతూంటే గర్వించాను. చివరికి చెల్లెమ్మ విధవైంది. ఆ కష్టంతోనే అదీ కన్నుమూసింది. ఇప్పుడీగతి పట్టింది. చింతలేదు. నువ్వింత పెద్దపదవికివస్తే ఓర్వలేనితనమా నాకు? కన్నతల్లిని నేను సంతోషించవలసినదాన్ని

కదరా? కానీ బాధపడుతున్నాను దేవుడు నన్నెందు కింకా బతకనిచ్చాడాఅని. నాబాధ నీకు తెలియదురా తండ్రీ. ఎంతమందిరా? ఎన్నికోట్లమంది ప్రాణాలు యిచ్చి పెంచుకొచ్చారీ కాంగ్రెసును? పోతూందిరా నాయనా, నాశనమైపోతూందిరా. ఏడుస్తుంది. (ఏడుస్తుంది)

జగ: (కరిగిపోయాడు) అమ్మా, యిప్పుడు నన్నేం చేయమంటా వమ్మా? రాజీనామా యివ్వమంటావా?

భార: రాజీనామా యిస్తే చేసినపాపం ఎట్లా పోతుందిరా? వెళ్ళండి. ప్రజల దగ్గరికెళ్ళి, మీరు చేసిన పాపాల్ని ఒప్పు కుని, లెంపలు వేసుకోండి. ఈ పాపం యిట్లాగే పెరిగిందా, ప్రజలు మిమ్మల్ని క్షమించరు. మీరక్తం కళ్ళ చూస్తార్రా వాళ్ళు.

జగ: అమ్మా! మరీ అఘాయిత్యం చేస్తున్నావు. అదంతా ఏమీ వీలులేదు. ప్రజల దగ్గరకెళ్ళి క్షమాపణలు కోరు కోవటం ఎన్నటికీ జరగదు. అలా జరిగితే ఏమవుతుందో తెలుసా? ప్రభుత్వం పడిపోతుంది. కాంగ్రెస్ నామరూపా ల్లేకుండా పోతుంది.

భార: ఇంకా ఎక్కడుందిరా కాంగ్రెస్. కాంగ్రెస్సే కనుక వుంటే, యీఅడ్డమైనవాళ్ల కాళ్ళూ పట్టుకుని కలుపుకోవలసిన కర్మేమొచ్చిందిరా. నిజాయితీవున్న ఒకరిద్దరూ రాజీనామా లెందుకిస్తార్రా! ఇంకా సిగ్గులేక 'కాంగ్రెస్, కాంగ్రెస్' అని ఒకశవాన్నిచూపి బెదరిస్తున్నారా, మీ బతుకు చెడ!

జగ: అమ్మా, యీ రాజకీయాల్లో నువ్వు రక్తపాశాన్నికూడా తెగ తెంచుకుంటున్నావు.

భార : అదికాదురా. నిన్నాశీర్వదించాల్సిన తల్లిని ఆర్థిస్తున్నాను. మన వంశంలో ఒక దేశద్రోహి పుట్టాడన్న అపకీర్తి తీసుకురాకురా. మన కీ పదవులు వద్దు; ఇట్లాగే వస్తులుండి చస్తాం కావాలంటే...వద్దురా.

జగ : అమ్మా ! చివరిసారి చెప్తున్నాను. నువ్వు రాజకీయాల్లో తల దూర్చకుండా వచ్చేటట్లుంటే రా ! లేకపోతే నీకూ, నాకూ ఏమీ సంబంధంవుండదు. నీ ముఖం చూడాల్సిన అవసరంకూడా వుండదు. (వెళ్తున్నాను.)

భార : (చేయిపట్టుకుని ఆపింది) ఆగు ! పిచ్చయ్యను ఎందుకు చంపించావో చెప్పి వెళ్ళు.

జగ : చెప్పటానికి వీల్లేదు.

భార : చెప్తావా, లేదా ?

జగ : నువ్వెవరు నన్నడగటానికి ?

భార : నేనా నీ కన్నతల్లిని.

జగ : నువ్వు నా తల్లివి కావు. నేను నీ కొడుకునూ కాదు.

భార : ఆఁ, అంతదూరం వచ్చావా ? అయితే నేను భారత దేశ ప్రజల్లో ఒక తెను. అడుగుతున్నాను. కాళ్ళమీదపడి ఒప్పుకో తప్పును.

జగ : ఒప్పుకోటంగాదు. అటువంటి పిచ్చయ్యలు వెయ్యి మందినయినా చంపుతాం. ప్రభుత్వానికి ఎదురుతిరిగిన వాళ్ళను ఎవరినైనా సరే సహించం, చంపుతాం.

భార : చంపుతారా ? నే నెదురుతిరుగుతున్నాను. చంపరా, చంపు.

జగ : అమ్మా! నిన్నెవరు రెచ్చగొట్టారో నాకు తెలుసు. వాళ్లేం చేయాలో కూడా నాకు బాగా తెలుసు. సుబ్బన్నా, (సుబ్బన్న వచ్చాడు) మలబారు పోలీసుల్ని పిలిపించు. మాలగూడానికి కాపలా పెట్టించు.

సుబ్బన్న : అవన్నీ ఎప్పుడో చేసేశామయ్యా! ఈపాటికి చాలా దూరం అయిపోయివుంటుంది.

భార : ఆ‌ః!!

జగ : (నవ్వాడు.)

(ఇంతలో వాకిటినుంచి 4, 5 గురు స్త్రీలు పిల్లల్ని చంకన వేసుకుని, కంగారుగా వగరుస్తూ, రక్తసిక్త వస్త్రాలతో "భారతమ్మా భారతమ్మా" అని అరుస్తూ వచ్చారు.)

స్త్రీలు : భారతమ్మా, భారతమ్మా! అయిపోయింది. అంతా అయిపోయిందమ్మా. మాగూడెం అంతా మసి అయిపోతా వుందమ్మా. రండమ్మా. మీరన్నా వచ్చి రచ్చించండి.

భార : ఏమిటె యీ గాయాలు? ఈ రక్తం అంతా ఏమిటే?

స్త్రీలు : పోలీసోళ్ళు వచ్చిపడ్డారు. కనబడ్డోళ్ళను కనబడ్డట్టు తల పగలగొడతూండారమ్మా.

భార : ఆ‌ః!!

స్త్రీలు : కన్నూ మిన్నూ కానకుండా పైబడుతుండారు. మొగాళ్ళను దిసమొలల్తో వూరేగింపుచేసి గాంధీ యిగ్రహం కాడ నిలబెట్టి కొడుతుండారు. ఆడోళ్ళనూ యిడిసి పెట్టేట్లులేరు. రాచ్చసుల్లాగా గుడిసెల్లో దూరి మూలనున్న ముసలమ్మల్నికూడా లాగి బైటేస్తున్నారమ్మా. నూస్తే ఎంతకాడికన్నా ఎళ్ళేట్టుంది.

సత్యాగ్రహులు చూద్దాం. ఎవర్రా అక్కడ! దీన్ని తీసుకెళ్ళి తోయండిరా జైల్లో.

(పోలీసు వచ్చాడు. జగన్నాధం వెనుతిరిగి వెళ్తున్నాడు. భారతమ్మ స్త్రమని లేచింది. "జగ్గూ" అంటూ చేతనున్న కర్ర విసిరింది. జగ్గు తల దిమ్మెక్కింది. పోలీసు జగ్గూను పట్టుకున్నాడు. తమాయించుకుని "అరెస్టు" అని ఆజ్ఞాపించాడు. పోలీస్ భారతమ్మను సమీపించాడు. "వస్తున్నా" అని చేతితో సంజ్ఞ చేసి భారతమ్మ ఒక్కసారి బాపూజీకి నమస్కరించింది.)

భార : అందరినీ అర్పించాను. మంచికే అర్పించాను. వీడొక్కడు మిగిలాడు. వీడుండటం దేశానికి శ్రేయస్కరం కాదు. కన్నతల్లిగా నా ప్రయత్నం నేను చేశాను. ఇక వీణ్ణి ప్రజల కప్పజెప్పి వెళ్తున్నాను. (ప్రజలు తనఎదుట వున్నట్లే ఆవేశంతో) మళ్ళా మళ్ళా మోసపోకండి. దేశాన్ని కాపాడుకోండి.

(నేపథ్యంలో ఒక కంఠం)

ధన్యవో తల్లి ! నిను కన్న ధాత్రి ధన్య
అందుకో మాడుకోట్లజోహార్లు నీకు
దమననీతికి బలియైన త్యాగమూర్తి
నడచివత్తుము మేము నీ అడుగుజాడ !

(భారతమ్మ గంభీరంగా నడిచివెళ్లింది. పోలీసు ఆమె వెంబడివెళ్ళాడు. మంత్రి సత్తెముడు ఆలాగే నిలబడి వున్నాడు. ఒక్క క్షణం వ్యవధి. తరువాత బైట కొన్ని కోట్ల గొంతుకలపాట)

తరలిందీ !
తరలిందీ !

ప్రజావాహిని తరలింది !
ప్రజా ద్రోహులను తరిమింది !
గిరులను ముంచి
దరులను త్రెంచి
నురుగులు చెరుగుతు
వురికిందీ !
వెరపులు మాపి
వెలుగులు చూపి
విశాలాంధ్రగా
వెలిసిందీ !
అజేయశక్తి
అనంతదీప్తి
ఆంధ్ర ప్రజలలో
కలిగిందీ !
అనాదిగా యీ
జనాన్ని దోచే
అమానుషత్వం
అదిరిందీ !
ప్రజాశక్తియే గెలిచిందీ !

ప్రజారాజ్యము నిలిపిందీ !
నిజాయితీగా సజాతీయముగా
ధ్వజారోహణం చేసిందీ !

(పాట, పాటతోపాటు ప్రజా ప్రవాహం తోసుకొస్తుంటే మంత్రి వణికిపోయాడు. గబగబ గాభరాగా కాలికి బుద్ధి చెప్పాడు.)

[తెర]

★